రైతన్న కోసం!

మొదటిపేజీ తరువాయి...

రైతులకు అండగా నిలవాలని కేసీఆర్ నిర్ణయించుకున్నారు. సాగు నీటి కోసం పడుతున్న కష్టాలను కండ్లారా చూసి రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించేందుకు రైతుల చెంతకు వస్తున్నారు. ఇప్పటికే ఉమ్మడి నల్లగొండ జిల్లాలో పర్యటించిన కేసీఆర్.. శుక్రవారం ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో పర్యటించి ఎండిన పంటలను పరిశీలించనున్నారు. రైతులతో నిర్వహించే ముఖాముఖిలో పాల్గొని వారి కష్టాలను అడిగి తెలుసుకోనున్నారు. మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ ప్రాతినిధ్యం వహిస్తున్న కరీంనగర్ మండలం మొగ్దుంపూర్‌లో ఎండిన పంటలను పరిశీలిస్తున్నారు. శ్రీరాంసాగర్ ప్రాజెక్టు డీ-93 పరిధిలోని మొగ్దుంపూర్‌లో యాసంగిలో సాగుచేసిన 60 శాతం పంటలు ఎండిపోయాయి. ఆయకట్టు చివరి భూముల సంగతి దేవుడెరుగు.. కాలువ మొదట ఉన్న పంటలు కూడా నీళ్లందక ఎండిపోయాయి. ఈ కారణంగా గ్రామ రైతులు తీవ్రంగా నష్టపోయారు.

కేసీఆర్ పొలంబాట షెడ్యూల్

శుక్రవారం ఉదయం 8:30 గంటలకు సిద్దిపేట జిల్లా ఎర్రవల్లిలోని వ్యవసాయక్షేత్రం నుంచి రోడ్డు మార్గంలో బయలుదేరి 10:30 గంటలకు కరీంనగర్ రూరల్ మండలం మొగ్దుంపూర్‌కు చేరుకుంటారు. ఎండిన పంటలను పరిశీలిస్తారు. రైతులతో ఏర్పాటుచేసిన ముఖాముఖిలో పాల్గొంటారు. మధ్యాహ్నం ఒంటిగంటకు కరీంనగర్‌లోని ఎమ్మెల్యే గంగుల కమలాకర్ నివాసంలో భోజనం చేస్తారు. 2 గంటలకు రాజన్నసిరిసిల్ల జిల్లా బోయినపల్లిలో ఎండిన పంటలను పరిశీలిస్తారు. తర్వాత 3 గంటలకు శాభాష్‌పల్లి వంతెనపైకి చేరుకొని మధ్యమానేరు(శ్రీరాజరాజేశ్వర జలాశయం)ను పరిశీలిస్తారు. సాయంత్రం 4 గంటలకు సిరిసిల్లలోని తెలంగాణభవన్‌కు చేరుకొని మీడియాతో మాట్లాడతారు. 5 గంటలకు తిరుగు ప్రయాణమై ఎర్రవల్లిలోని వ్యవసాయక్షేత్రానికి చేరుకుంటారు.

జాతీయ పార్టీలకు అభ్యర్థులే కరువు!

రాష్ట్రంలో కాంగ్రెస్, బీజేపీకి వింతైన పరిస్థితి

- బరిలో దింపేందుకు నేతలు లేక సతమతం
- బీఆర్ఎస్ నుంచి నేతలను గుంజుకొని టికెట్లు
- ఏకంగా సిట్టింగ్ ఎమ్మెల్యేకే టికెట్ ఇచ్చిన కాంగ్రెస్
- 10 చోట్ల బీఆర్ఎస్‌కు మాజీ నేతల మధ్యే పోటీ

హైదరాబాద్, ఏప్రిల్ 4 (నమస్తే తెలంగాణ): 'ఈ సారి లోక్‌సభ ఎన్నికల్లో అత్యధిక స్థానాలు మేమే గెలుస్తాం'.. రాష్ట్రంలో కాంగ్రెస్, బీజేపీ నేతలు చేస్తున్న భీకర ప్రకటనలు ఇవి. సుదీర్ఘకాలం దేశాన్ని పాలించిన ఆ జాతీయ పార్టీలకు పోటీలో దిగేందుకు అభ్యర్థులు కూడా కరువయ్యారు. అందుకే బీఆర్ఎస్ తయారు చేసిన, బీఆర్ఎస్ ప్రకటించిన అభ్యర్థులను గుంజుకొని మరీ టికెట్లు ఇస్తున్నారు. బీజేపీ కేంద్రంలో అధికారంలో ఉండగా, రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉన్నది. అయినా లోక్‌సభ నియోజకవర్గాలకు పోటీ చేసే స్థాయి నేతలు లేని దుస్థితిలో అవి కొట్టుమిట్టాడుతున్నాయి. అందుకే రెండు పార్టీలూ బీఆర్ఎస్ మీదపడ్డాయి. 17 లోక్‌సభ నియోజకవర్గాల్లో ఇప్పటికే 10 నియోజకవర్గాల్లో జాతీయ పార్టీల తరపున బీఆర్ఎస్ నుంచి చేర్చుకున్న నేతలే బరిలో ఉన్నారు. అంటే.. దాదాపు 60 శాతం నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ నేతలు, ఆ పార్టీ మాజీ నేతల మధ్యే పోటీ నెలకొన్నదన్నమాట. వరంగల్‌లో పరిస్థితి మరీ విచిత్రం. అక్కడ బీజేపీ నుంచి ఆరూరి రమేశ్, కాంగ్రెస్ నుంచి కడియం కావ్య బరిలో ఉన్నారు. వీరిద్దరూ బీఆర్ఎస్ నుంచి వెళ్లిన నేతలే. అంటే అక్కడ పోటీ మూడు పార్టీల మధ్య కాకుండా.. బీఆర్ఎస్‌లో కలిసి మెలిగిన నేతల మధ్యే పోటీగా తయారైందని రాజకీయ విశ్లేషకులు ఎద్దేవా చేస్తున్నారు. ఇలాంటి పార్టీలు మెజార్టీ సీట్లు ఎలా సాధిస్తాయని వారు ప్రశ్నిస్తున్నారు.

అధికార పార్టీకి 'అరువు' నేతలు

రాష్ట్రంలో కాంగ్రెస్ గాలివాటంగా అధికారంలోకి వచ్చిందని మొదటి నుంచీ విమర్శలు ఉన్నాయి. తమది గాలివాటు విజయం కాదని.. ప్రజాభిమానం ఉన్నదని లోక్‌సభ ఎన్నికల్లో నిరూపించుకోవాలని నిర్ణయించుకున్నది. అందుకే ఈసారి 14 సీట్లు గెలుస్తామని సీఎం రేవంత్‌రెడ్డి పదే పదే చెప్పుకుంటున్నారు. వాస్తవ పరిస్థితిని చూస్తే అనేక చోట్ల కనీసం పోటీ చేసేందుకు కూడా అభ్యర్థులు దొరకని పరిస్థితి. అందుకే 'అరువు' నేతల కోసం బీఆర్ఎస్ వైపు చూసింది. ఇప్పటివరకు 14 స్థానాలకు అభ్యర్థులను ప్రకటిస్తే.. అందులో ఐదుగురు బీఆర్ఎస్ నుంచి వెళ్లిన నేతలే పోటీలో ఉన్నారు. సికింద్రాబాద్‌లో ఏకంగా బీఆర్ఎస్ సిట్టింగ్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌కు టికెట్ ఇచ్చే దుస్థితికి దిగజారిందని విశ్లేషకులు సైతం కాంగ్రెస్ వైఖరిపై మండిపడుతున్నారు. వరంగల్‌లో బీఆర్ఎస్ అభ్యర్థిగా ప్రకటించిన కడియం కావ్యను తమ పార్టీలో చేర్చుకొని మళ్లీ అదే స్థానంలో బరిలోకి దింపింది. చేవెళ్ల అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డి, మల్కాజిగిరి నుంచి బరిలో ఉన్న పట్నం సునీతా మహేందర్‌రెడ్డి తాజాగా పార్టీలో చేరగా, పెద్దపల్లి అభ్యర్థి గడ్డం వంశీకృష్ణ తండ్రి గడ్డం వివేక్ అసెంబ్లీ ఎన్నికల ముందు పార్టీ మారారు. బీఆర్ఎస్, కాంగ్రెస్, బీఎస్పీ అంటూ కుర్చీలాట మాదిరిగా పార్టీలు మారిన నీలం మధుకు మెదక్ టికెట్ ఇచ్చింది. హైదరాబాద్, ఖమ్మం, కరీంనగర్ అభ్యర్థుల ఎంపికపై కాంగ్రెస్‌లో ఇంకా ఊగిసలాట కొనసాగుతున్నది. ఆయా స్థానాల్లో నేతలు ఎవరైనా వస్తారేమో అనే ప్రయత్నాలు చేస్తున్నట్టు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతున్నది.

కాంగ్రెస్, బీజేపీ నుంచి బరిలో నిలిచిన బీఆర్ఎస్ మాజీ నేతలు

సికింద్రాబాద్	దానం నాగేందర్ (కాంగ్రెస్)
మల్కాజిగిరి	పట్నం సునీతా మహేందర్‌రెడ్డి (కాంగ్రెస్)
చేవెళ్ల	రంజిత్‌రెడ్డి (కాంగ్రెస్)
నల్లగొండ	శానంపూడి సైదిరెడ్డి(బీజేపీ),
వరంగల్	ఆరూరి రమేశ్ (బీజేపీ), కడియం కావ్య (కాంగ్రెస్)
మహబూబాబాద్	సీతారాంనాయక్ (బీజేపీ)
నాగర్‌కర్నూల్	పీ భరత్ (బీజేపీ)
ఆదిలాబాద్	గోడెం నగేశ్ (బీజేపీ)
జహీరాబాద్	బీబీపాటిల్ (బీజేపీ)
పెద్దపల్లి	గడ్డం వంశీకృష్ణ (కాంగ్రెస్)

బీజేపీకి కల్పతరువుగా బీఆర్ఎస్

బీజేపీ నేతలు ఎన్ని గొప్పలు చెప్పుకున్నా.. రాష్ట్రంలో కిషన్‌రెడ్డి, బండి సంజయ్, అర్వింద్ వంటి ముగ్గురు నలుగురికి మించి ప్రజల్లో గుర్తింపు ఉన్న నేతలు లేరన్నది వాస్తవం. అందుకే ఇతర పార్టీల నుంచి నేతలను చేర్చుకోవడాన్ని నిరంతర ప్రక్రియగా ఆ పార్టీ కొనసాగిస్తున్నది. ఇప్పుడు బీజేపీలో కీలక స్థానాల్లో ఉండి, అభ్యర్థులుగా బరిలో ఉన్న ఈటల రాజేందర్, రఘునందన్‌రావు, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి వంటి నేతలు బీఆర్ఎస్ నుంచి వెళ్లినవారే. ఈ లోక్‌సభ ఎన్నికల్లో 17 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించగా ఇందులో 6 స్థానాలు బీఆర్ఎస్ నుంచి అప్పటికప్పుడు వచ్చిన నేతలకే కేటాయించారంటే పార్టీ పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. నల్లగొండ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డి, జహీరాబాద్ బరిలో ఉన్న బీబీపాటిల్, వరంగల్ నుంచి ఆరూరి రమేశ్, మహబూబ్‌నగర్‌కు చెందిన సీతారాంనాయక్, ఆదిలాబాద్‌లో గోడెం నగేశ్, నాగర్‌కర్నూల్ అభ్యర్థి భరత్ రాత్రికి రాత్రే బీజేపీలో చేరి టికెట్ పొందిన వారే. ఇలా సొంతంగా నేతలను తయారు చేసుకోలేని, కనీసం పోటీ చేసే స్థాయిలో బలమైన నేతలు లేని జాతీయ పార్టీలు రెండంకెల సీట్లు గెలుస్తామంటూ పోటాపోటీగా ప్రకటనలు గుప్పిస్తుండాన్ని రాజకీయ విశ్లేషకులు ఎద్దేవా చేస్తున్నారు. ముందుగా నేతలను తయారు చేసుకోవాలని సూచిస్తున్నారు.

లోకం పోకడ

అయ్యో, ఎండలపడి వచ్చారు.. నందికొండ నుంచి మంచినీళ్లు తెప్పించాం.. తాగి వెళ్లండి!

ఎండా కాలం

	గరిష్ఠం	కనిష్ఠం
ఆదిలాబాద్	42.5°c	22.1°c
నల్లగొండ	42.1°c	24.6°c
మెదక్	42.0°c	24.1°c
రంగారెడ్డి	41.6°c	24.2°c
నిజామాబాద్	41.2°c	28.3°c
హైదరాబాద్	40.3°c	26.4°c
ఖమ్మం	40.0°c	26.0°c
మహబూబ్‌నగర్	39.2°c	26.5°c
కరీంనగర్	39.0°c	28.0°c
వరంగల్	39.0°c	27.0°c

భానుడు భగభగ.. జనం విలవిల

- అత్యధికంగా నిడమనూరులో 43.5 డిగ్రీలు

హైదరాబాద్, ఏప్రిల్ 4 (నమస్తే తెలంగాణ)/ లింగాల: రాష్ట్రవ్యాప్తంగా భానుడి భగభగలు కొనసాగుతున్నాయి. ఎండ తీవ్రతకు జనం విలవిలలాడుతున్నారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాలో గురువారం దాదాపు 42 డిగ్రీలకుపైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. నల్లగొండ జిల్లా నిడమనూరులో అత్యధికంగా 43.5 డిగ్రీల ఉష్ణోగ్రత రికార్డయింది. శుక్ర, శనివారాల్లో వడగాల్పులు వీస్తాయని వాతావరణశాఖ తెలిపింది. సాధారణం కంటే 5-8 డిగ్రీల ఎక్కువ ఉష్ణోగ్రతలు నమోదవుతాయని ఐఎండీ హెచ్చరించింది. 130 మండలాల్లో తీవ్ర వడగాలుల నేపథ్యంలో వాతావరణశాఖ ఎల్లో అలర్ట్ జారీ చేసింది. 7, 8 తేదీల్లో పలు ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉన్నదని తెలిపింది.

వడదెబ్బతో వృద్ధుడి మృతి

నాగర్‌కర్నూల్ జిల్లా లింగాల మండలం శ్రీరంగాపూర్‌కు చెందిన మర్రపల్లి ఈరయ్య (70) వడదెబ్బతో మృతి చెందాడు. బుధవారం తన వ్యవసాయ పొలం వద్దకు వెళ్లి తిరిగి రాకపోవడంతో సాయంత్రం కుటుంబ సభ్యులు వెళ్లి చూడగా అప్పటికే మృతి చెందాడు.

ఆలయాల్లో వేసవి వసతులు

- షామియానాలు, తాగునీటి సౌకర్యం
- వృద్ధులు, వికలాంగులకు వీల్‌చైర్లు
- క్యూ కాంప్లెక్స్‌ల వద్ద షెడ్ల ఏర్పాటు

హైదరాబాద్, ఏప్రిల్ 4 (నమస్తే తెలంగాణ): ఎండలు మండిపోతున్న నేపథ్యంలో రాష్ట్రంలోని ప్రధాన ఆలయాల్లో దేవాదాయ శాఖ భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. షామియానాలు, తాగునీటి సౌకర్యం, చిన్న పిల్లలకు పాలిచ్చేందుకు లాక్టేషన్ గదులు, వృద్ధులు, వికలాంగులకు వీల్‌చైర్లు, క్యూ కాంప్లెక్స్‌ల వద్ద షెడ్‌లు తదితర వసతులు కల్పిస్తున్నారు. ఆలయాల్లో భక్తులకు అసౌకర్యం కలుగకుండా వేసవిలో తగిన చర్యలు తీసుకోవాలని దేవాదాయశాఖ కమిషనర్ హనుమంతరావు ఇచ్చిన తాజా ఆదేశాల మేరకు ప్రత్యేక సౌకర్యాలు కల్పించారు. యాదాద్రి లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో భక్తులు ఎండకు ఎండకుండా, కాళ్లు కాలకుండా, వానకు తడవకుండా ఆధునిక జర్మన్ హాంగర్ షెడ్‌ను ఏర్పాటు చేశారు. ఉత్తర మాడవీధిలో 23,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో షెడ్ ఏర్పాటు వల్ల స్వామివారి దర్శనం అనంతరం భక్తులు సేదదీరేందుకు సౌకర్యం కలిగింది. క్యూలైన్ల వద్ద లాక్టేషన్ గదులు, మంచినీటి నల్లాలు, సీటింగ్ సౌకర్యం, క్యూ కాంప్లెక్స్ వద్ద ఏసీ సామర్థ్యం పెంపు, వృద్ధులు, దివ్యాంగుల కోసం ప్రోటోకాల్ విభాగం వద్ద వీల్‌ఛైర్లు, టికెట్ కౌంటర్ నుంచి క్యూకాంప్లెక్స్ వరకు షెడ్‌ల ఏర్పాటు తదితర సౌకర్యాలను కల్పించారు.

రేవు తప్పిన పారకం

మొదటిపేజీ తరువాయి...

ఎత్తారు? అనేది మరో ప్రశ్న. వాస్తవానికి ఎన్డీఎస్ఏ నివేదిక వచ్చేదాకా కాళేశ్వరం మోటర్లు నడిపే ప్రసక్తే లేదని ప్రభుత్వం భీష్మించుకొని కూర్చున్నది. తాము ఇంజినీర్లు కాదు.. నిపుణుల సూచన మేరకే నడుచుకుంటామని సీఎం రేవంత్ సహా మంత్రులు చెప్తూ వచ్చారు. ఒకవేళ ఎన్డీఎస్ఏ కమిటీ ఆదేశాల ప్రకారమే నీటిని విడుదల చేస్తే.. ప్రజాప్రతినిధి ఫోన్ చేయగానే ఎందుకు నీటి విడుదల ఆపేసినట్టు? అన్నది అసలైన ప్రశ్న. ఇన్ని అనుమానాల మధ్య రాష్ట్రంలో సాగునీటి నిర్వహణ ఇంజినీర్ల ప్రణాళిక ప్రకారం అమలవుతున్నదా? లేక మంత్రులు, ఎమ్మెల్యేల ఫోన్‌కాల్స్‌పై గేట్లు తెరవడం, మూయడం జరుగుతున్నదా? అన్న కొత్త ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

అనంతగిరి.. అంతులేని విషాదం

కరీంనగర్ జిల్లా ఇల్లంతకుంట మండలం అనంతగిరి రిజర్వాయర్ కింది ఆయకట్టు రైతుల్లో ఈ ఏడాది అంతులేని విషాదం నెలకొన్నది. కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వాకంతో వేల ఎకరాల్లో పంట నష్టపోయిన దుస్థితి. అనంతగిరి రిజర్వాయర్‌కు అల్లీపూర్, అనంతారం వైపుగా రెండు ఫ్రీ ఫ్లో గేట్లు ఉన్నాయి. రిజర్వాయర్ పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 3.5 టీఎంసీలు. రిజర్వాయర్ పూర్తిగా నిండిన సమయంలో ఆ ఫ్రీ ఫ్లో గేట్ల ద్వారా దిగువన ఒకవైపు రేపాక పెద్దచెరువు, మరోవైపు అనంతారం చెరువు అక్కడి నుంచి రహీంఖాన్‌పేట చెరువు ఇలా గొలుసుకట్టు చెరువులకు నీళ్లు వదిలేవారు. అదేవిధంగా బిక్కవాగులోకి నీటిని వదిలిపెట్టేవారు. తద్వారా వాగు చుట్టుపక్కల ఉన్న 10 గ్రామాల్లో, గొలుసు కట్టు చెరువుల కింద వేల ఎకరాల్లో పంటలు సాగయ్యేవి. కాళేశ్వరం ప్రాజెక్టు ప్రారంభించిన నాటి నుంచి దాదాపు ఐదేండ్లుగా రెండు పంటలకు పూర్తి భరోసా లభించింది. కానీ ఈ ఏడాది కాళేశ్వరం ఎత్తిపోతలు లేవంటూ సర్కారు చెరువులను నింపలేదు. కాంగ్రెస్ అధికారం చేపట్టేనాటికి మధ్యమానేరులో 18 టీఎంసీలకుపైగా నీళ్లు ఉన్నాయి. అన్నపూర్ణ పంప్‌హౌజ్‌లో కూడా 2.5 టీఎంసీల జలాలు ఉన్నాయి. మధ్యమానేరు జలాశయం నుంచి అదనంగా 1 టీఎంసీని ఎత్తిపోస్తే ఫ్రీ ఫ్లో గేట్లు పనిచేసేవి. కొద్ది మొత్తంలో నీటిని విడుదల చేసి చెరువులను నింపితే ఇప్పుడు అక్కడ పంటలు ఎండిపోవాల్సిన దుస్థితి వచ్చేది కాదు. కానీ ప్రభుత్వం ఆ పనిచేయలేదు. అన్నపూర్ణలో ఉన్న జలాలను రంగనాయకసాగర్‌కు తరలించింది. వెరసి ఇప్పుడు అన్నపూర్ణలో 0.87 టీఎంసీలు మాత్రమే ఉన్నాయి. ఇక మధ్యమానేరులో ఇప్పుడు 7.7 టీఎంసీల జలాలు ఉండగా, అందులో ఎస్సారెస్పీ ఆయకట్టు కోసం నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. మొత్తంగా ప్రభుత్వం అవగాహనరాహిత్యంతో అనంతగిరి కింది ఆయకట్టు ఎండిపోతున్న దుస్థితి.

ఎస్సారెస్పీ కాల్వల నిర్వహణలేమి

ఎస్సారెస్పీ కాల్వల నిర్వహణపైనా ప్రభుత్వానికి అవగాహన లేదని తెలిసిపోతున్నది. వాస్తవంగా ఎస్సారెస్పీ స్టేజ్ 1, స్టేజ్ 2 కింద దాదాపు 13 లక్షల ఎకరాలకు పైగా ఆయకట్టు ఉన్నది. ఎస్సారెస్పీ కాలువల కింద కాకుండా ఆ కమాండ్ ఏరియాలో భూగర్భ జలాల ఆధారంగా అదనంగా 5 లక్షల ఎకరాలకు పైగా సాగు అవుతుంది. మొత్తంగా 20 లక్షల ఎకరాలకుపైగా ఆయకట్టు సాగు అయ్యేది. కాల్వలకు వాటి సామర్థ్యం మేరకు సమృద్ధిగా నీరు అందించినప్పుడే కమాండ్ ఏరియాలో భూగర్భ జలాలు నిలకడగా ఉండి పంటలు సాగయ్యే అవకాశం ఉంటుంది. అదేవిధంగా కాలువల కింది ఆయకట్టుకు సైతం పుష్కలంగా నీరందే పరిస్థితి ఉంటుంది. కాళేశ్వరం అందుబాటులోకి వచ్చాక ఈ 20 లక్షల ఆయకట్టుకు పూర్తి భరోసా లభించింది. కానీ ఈ ఏడాది ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టును నిలిపేయడంతో ఆయకట్టు మొత్తం అస్తవ్యస్తంగా తయారైంది. కాళేశ్వరం అందుబాటులోకి వచ్చిన అనంతరం ఎస్సారెస్పీ నీటిని ఎల్ఎండీ ఎగువకే పరిమితం చేశారు. ఎల్ఎండీ దిగువకు కాళేశ్వరం నుంచి ఎత్తిపోసిన జలాలనే తరలించేవారు. దాంతో నీటి కొరత ఉండేది కాదు. చివరి మడికి సైతం తడి తాకింది. కాంగ్రెస్ సర్కారు మాత్రం కాళేశ్వరం ఘనతను చిన్నగా చూపాలన్న ప్రయత్నంలో కాళేశ్వరం లేకున్నా ఎస్సారెస్పీ చివరి ఆయకట్టుకు సైతం నీళ్లు ఇస్తామని చెప్పుకొచ్చింది. కానీ ఆచరణలో మాత్రం బొక్కబోర్లా పడింది. కాంగ్రెస్ అధికారం చేపట్టేనాటికి ఎల్ఎండీ, ఎస్సారెస్పీ, ఎంఎండీలో కలిపి 100 టీఎంసీలకు పైగా నీళ్లు అందుబాటులో ఉన్నాయి. ఆ నీళ్లను ఎంత పొదుపుగా వాడుకున్నా గరిష్ఠంగా 12 లక్షలకు మించి ఆయకట్టుకు ఇవ్వలేమన్నది అధికారుల మాట. అయినా నిజాలు దాచి స్టేజ్-2 కూడా ఇస్తున్నామని చెప్పి పెన్‌పహాడ్ వరకు నీటిని విడుదల చేసింది. అయితే నీటి పొదుపు పేరుతో కాల్వలకు నిర్దేశిత సామర్థ్యం మేరకు నీటిని విడుదల చేయకపోవటంతో రైతులు ఎక్కడికక్కడ మోటర్లు పెట్టి తోడేయటం, ఎవరు ఒత్తిడి చేస్తే వారికి నీటిని విడుదల చేయడంతో సాగునీటి వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. మరోవైపు ట్రాన్స్‌మిషన్ నష్టాలు విపరీతంగా పెరిగిపోయాయి. కమాండ్ ఏరియాలో భూగర్భ జలమట్టం పెరిగిందిలేదు. వెరసి ఎస్సారెస్పీ ఆయకట్టులో 5 లక్షలకు మించి ఎకరాలు ఎండిపోయే దుస్థితి తలెత్తింది.

అవగాహనారాహిత్యమే!

నీటి నిర్వహణపై కాంగ్రెస్ ప్రభుత్వానికి ఏమాత్రం అవగాహన లేదని చెప్పడానికి ఎస్సారెస్పీ కాల్వలు, అన్నపూర్ణ రిజర్వాయర్, సుందిళ్ల బరాజ్ ఘటనలే ఉదాహరణలుగా నిలుస్తాయి. కమాండ్ ఏరియాలో నేల పొడిబారకముందే నీటిని విడుదల చేస్తే నీటి సరఫరా నష్టాలను గణనీయంగా తగ్గించే అవకాశం ఉంటుంది. కానీ ప్రభుత్వం ఆ పనిచేయకుండా భూగర్భజలాలు అడుగంటిన తర్వాత., కాల్వలు పొడిబారిన తర్వాత నీటిని విడుదల చేయటంతో ట్రాన్స్‌మిషన్ నష్టాలు విపరీతంగా పెరిగాయని రైతులు వివరిస్తున్నారు. ప్రభుత్వానికి ఒక ప్రణాళిక అంటూ లేదని నిప్పులు చెరుగుతున్నారు.

ఎన్నో అనుమానాలు.. ఇవ్వాలి సమాధానాలు

1. సుందిళ్ల బరాజ్ గేట్లు ఎందుకు ఎత్తినట్టు?
2. 4 గంటల్లోనే మళ్లా ఎందుకు మూసేసినట్టు?
3. బరాజ్‌లోని నీళ్లను ఎందుకు ఖాళీ చేయాలనుకున్నారు?
4. ఎన్డీఎస్ఏ ఇంజినీర్లు ఖాళీ చేయాలని చెప్పారా?
5. మరి.. 28వ తేదీ వరకు ఎందుకు నీళ్లను వదల్లేదు?
6. మళ్లా.. మంత్రిగారి ఫోన్‌తోనే ఎందుకు మూసేశారు?

కాంగ్రెస్ నిర్లక్ష్యం.. చేజారిన ప్రాణహితం

- చిన్నపాటి చర్యలతో ఒడిసిపట్టే అవకాశం
- ఎన్డీఎస్ఏ పేరిట తప్పించుకున్న సర్కారు

హైదరాబాద్, ఏప్రిల్ 4 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ అత్యుత్సాహం, అనాలోచిత నిర్ణయం ఫలితంగా ప్రాణహిత ఫలాలు ఈ ఏడాది చేజారిపోయాయి. వేల ఎకరాలు ఎండిపోవాల్సిన దుస్థితి వచ్చింది. ఏడాదిలో దాదాపు 10 నెలల పాటు ప్రాణహితలో ప్రవాహాలు కొనసాగుతాయి. ప్రస్తుతం గోదావరిలో ప్రవాహం లేకపోయినా ప్రాణహితలో ఇప్పటికీ 1,470 క్యూసెక్కుల ప్రవాహం కొనసాగుతున్నది. మార్చి రెండో వారం వరకు కూడా అక్కడ రోజుకు అర టీఎంసీకి పైగా జలాలు వచ్చాయి. అంటే నీటి లభ్యతను అర్థం చేసుకోవచ్చు. ఈ నేపథ్యంలోనే కాళేశ్వరం ప్రాజెక్టును కేసీఆర్ అక్కడ ప్రతిపాదించారు. దాదాపు ఐదేండ్ల పాటు ఆ ఫలాలను రైతాంగానికి అందించారు. ఎప్పుడు నీళ్లు అవసరమైనా ఎత్తిపోశారు. కానీ గత అక్టోబర్‌లో మేడిగడ్డ బరాజ్ కుంగుబాటుకు గురవటం, జాతీయ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్డీఎస్ఏ) అధికారుల బృందం బరాజ్‌లను సందర్శించటం, నీటి స్టోర్ చేయవద్దని సూచించిన విషయం తెలిసిందే. అయితే అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ సర్కారు రాజకీయ ప్రయోజనాలకు ప్రాధాన్యమిస్తూ.. నీటిని ఎత్తిపోసే అంశాన్ని పక్కనబెట్టిందని సాగునీటి రంగ నిపుణులు చెప్తున్న మాట. ప్రాణహిత జలాలను ఒడిసిపట్టే అంశాన్నే వదిలేసిందని వాదిస్తున్నారు. మేడిగడ్డ ఎగువన ఇసుక బస్తాలు వేయటం వంటి చిన్నపాటి చర్యలు చేపట్టి ప్రాణహిత జలాలను లక్ష్మీపంప్ హౌజ్ ఫోర్‌బేకు తరలించి నీళ్లను ఎత్తిపోసుకునే అవకాశం ఉన్నా దానిపై దృష్టి పెట్టలేదని స్పష్టం చేస్తున్నారు. ఎన్డీఎస్ఏ అక్టోబర్‌లో చెప్తే ఫిబ్రవరి వరకు అన్నారంలో బరాజ్‌లో నీళ్లను మాత్రం అలానే ఉంచిందని గుర్తుచేస్తున్నారు. కనీసం ఆ జలాలనైనా ఎల్లంపల్లికి మళ్లించి ఉంటే ఇప్పుడు తాగునీటికి కటకట ఉండేది కాదని పలువురు అధికారులు వివరిస్తున్నారు. నిల్వ ఉన్న నీళ్లను సైతం ముందస్తు ఆలోచన లేకుండా దిగువకు వదిలిందని పేర్కొంటున్నారు. ప్రభుత్వం రైతుల ప్రయోజనాల గురించి ఏ కొంచెం ఆలోచించినా దాదాపు 10-15 టీఎంసీలను ఎత్తిపోసుకునే అవకాశం ఉండేదని తేల్చి చెప్తున్నారు.

కార్యక్షేత్రంలోకి గులాబీదళం

- ఉగాది తరువాత ముమ్మర ప్రచారం
- పార్టీ అధినేత కేసీఆర్ బస్సుయాత్ర
- కేటీఆర్, హరీశ్‌రావు రోడ్‌షోలు
- కార్యాచరణ సిద్ధం చేస్తున్న బీఆర్ఎస్

హైదరాబాద్, ఏప్రిల్ 4 (నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పార్లమెంట్ ఎన్నికల ప్రచార వ్యూహంపై దృష్టి కేంద్రీకరించారు. పార్టీ తరపున బరిలో నిలిచే ఎంపీ అభ్యర్థుల ఎంపిక, పార్లమెంట్, అసెంబ్లీ నియోజకర్గాలవారీగా సమీక్షలు, సన్నాహక సమావేశాలు పూర్తయిన నేపథ్యంలో నేరుగా ప్రజలతో మమేకం అయ్యేందుకు సిద్ధమవుతున్నాయి. ఉగాది పర్వదినం తరువాత ప్రచారపర్వాన్ని హోరెత్తించనున్నట్టు సమాచారం. అసెంబ్లీ ఎన్నికల్లో అనుసరించిన వ్యూహానికి, పార్లమెంట్ ఎన్నికల్లో అనుసరించనున్న ప్రచార వ్యూహానికి తేడా ఉంటుందని పార్టీ వర్గాలు చెప్తున్నాయి. రాష్ట్రంలోని అన్ని పార్లమెంట్ నియోజకవర్గాలు కవర్ అయ్యేలా కేసీఆర్ బస్సుయాత్ర చేపట్టే అవకాశాలు ఉన్నాయని, ఇందుకోసం రూట్‌మ్యాప్ సైతం సిద్ధమవుతున్నదని ఆ వర్గాలు తెలిపాయి. బహిరంగసభలతోపాటు రోడ్‌షోలు, కార్నర్ మీటింగ్స్‌పై కేసీఆర్ దృష్టిపెడుతున్నట్టు సమాచారం. మరోవైపు కేటీఆర్, హరీశ్‌రావు మండల కేంద్రాలు, మున్సిపాలిటీ కేంద్రాల్లో రోడ్‌షోలు నిర్వహించేవిధంగా వ్యూహరచన చేస్తున్నట్టు తెలిసింది. తెలంగాణపై కాంగ్రెస్, బీజేపీ పన్నుతున్న కుట్రలను ప్రజలకు ఆధారాలతో సహా వివరించడం, తెలంగాణకు బీఆర్ఎస్ మాత్రమే టార్చ్‌బేరర్‌గా ఎలా పనిచేసింది? భవిష్యత్తులో ఎలా ఉండబోతున్నదనే అంశాన్నే ప్రధాన ఎజెండాగా మలిచే అవకాశాలు ఉన్నాయని తెలుస్తున్నది. బీఆర్ఎస్ అధికారం కోల్పోయి, కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరిన 100 రోజుల్లోనే రాష్ట్రంలోని ఏయే వర్గాలు ఎలా నిర్లక్ష్యానికి గురయ్యాయి? ఎలా నిర్వీర్యమయ్యాయి? అనే అంశాన్ని కేసీఆర్ తనదైన శైలిలో ప్రజలకు వివరించనున్నట్టు పార్టీ వర్గాలు తెలిపాయి. కాంగ్రెస్ పార్టీ ఇటీవల అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలులో వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కార్యాచరణ రూపొందించినట్టు విశ్వసనీయవర్గాల సమాచారం.

అంకుశంలాంటి క్యాడర్

కేసీఆర్ చేపట్టనున్న బస్సు యాత్ర పార్టీ క్యాడర్‌లో సమరోత్సాహం నింపేందుకు దోహదపడుతుందని పార్టీ నేతలు భావిస్తున్నారు. తక్కిన పార్టీలకు అవకాశవాద క్యాడర్ ఉంటే, తమకు మాత్రం అంకుశంలాంటి క్యాడర్ ఉన్నదని అనేక సందర్భాల్లో నిరూపితమైందని పార్టీ అగ్రనాయకత్వం ఉదహరిస్తున్నది. రాష్ట్రంలో మరే పార్టీకీ బలమైన పునాదిలేదని, తమకు మాత్రమే ఉన్నదని, అదే తమకు కొండంత బలమని గులాబీదళం ధీమాగా ఉన్నది. ఉగాది పండుగ తర్వాత ఎన్నికల శంఖారావం పూరిస్తామని, బీఆర్ఎస్ క్యాడర్ బలమేమిటో, సత్తా ఏమిటో చూపిస్తామని బీఆర్ఎస్ నేతలు చెప్